తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ మంగళవారం 14 - 07 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 3

## వైన్స్ సిట్టింగ్ రూం నుంచి వచ్చే..

# మసాలా ఘాటు భరించలేకపోతున్నాం


**ఇండ్ల మధ్య ఉన్న సిట్టింగ్‌రూం తొలగించాలని ఎక్సైజ్, పోలీస్, మున్సిపల్ ఆఫీసర్లకు స్థానికుల వినతి**

- నిత్యం చేపలు, చికెన్ ఫ్రైలతో వచ్చే పొగతో అనారోగ్యాల పాలవుతున్నాం
- చిన్నపిల్లలు, వృద్ధులు ఊపిరి పీల్చుకోలేకపోతున్నారు
- మసాలాల ఘాటు, మందుబాబుల ఆగడాలతో ఇండ్లలో ప్రశాంతంగా ఉండలేకపోతున్నాం



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో భువనగిరి రోడ్డులో జ్యోతిరావుపూలే విగ్రహం ఎదురుగా ఉన్న జైభవాని వైన్‌షాపు సిట్టింగ్ రూం నుంచి వచ్చే మసాలాల ఘాటు, ప్రతిరోజు చేపలు, చికెన్ ఫ్రైలతో నీసు వాసన, పొగతో ఇండ్లలో ప్రశాంతంగా ఉండలేకపోతున్నామని, ఇండ్ల మధ్య పెట్టిన ఆ సిట్టింగ్ రూంను వెంటనే తొలగించాలని కోరుతూ ఆ కాలనీ ప్రజలు సోమవారం ఎక్సైజ్, పోలీస్, మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండ్ల మధ్యనే వైన్‌షాపు, సిట్టింగ్‌రూం ఏర్పాటు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్ రూం నడుపుతూ ప్రతిరోజు చేపలు, చికెన్ ఫ్రై వేపుళ్ల మసాలాల ఘాటుతో ముక్కుపుటాలు పగిలిపోతున్నామని, మసాలాల ఘాటుతో చిన్న పిల్లలు, వృద్ధులు ఆ వాసనలు భరించలేక శ్వాసకోశ సమస్యలతో అనారోగ్యాల భారిన పడుతున్నారని, నిత్యం నీసు, మంటతో వచ్చే పొగతో తాము ప్రశాంతంగా ఇండ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం కోసం వచ్చేవారు తమ ఇళ్లముందు, దుకాణాల ముందు వాహనాలు నిలుపుతుండటంతో ఇండ్లు, దుకాణాల్లోకి వెళ్లేందుకు దారి కూడా ఉండటం లేదన్నారు. రాత్రివేళ మందు బాబులు తమ ఇళ్ల ముందు కూర్చుని తాగుతున్నారని, సీసలు పగులకొడుతున్నారని, మల, మూత్ర విసర్జన చేస్తూ తమ ఇండ్ల పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారని తెలిపారు. మసాలాల ఘాటు, పొగతో ఇబ్బంది పడుతున్నామని, వాటిని తొలగించమని అడిగితే వైన్స్, సిట్టింగ్ రూం నిర్వాహకులు తమపైనే బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. తమ ప్రశాంత జీవనానికి, అనారోగ్యాలకు కారణమవుతున్న వైన్స్ సిట్టింగ్‌రూంను తొలగించాలని కోరుతూ ఎక్సైజ్ ఎస్ఐ సత్యనారాయణతో పాటు మున్సిపల్, పోలీస్‌స్టేషన్లలో వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుజ్జ సోమనర్సయ్య, గందే నర్సయ్య, వారాల యాదగిరి, బత్తిని తిరుమలేష్, సోమయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

## మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య



**ప్రజావారధి/మోత్కూరు**

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని మోత్కూరు మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య అన్నారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరిశుభ్రత కారణంగా విద్యార్థుల్లో నులి పురుగులు పెరిగి రక్తహీనతతో అనారోగ్యం భారిన పడతారని, నులి పురుగులను నివారిస్తే రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. నులి పురుగుల నివారణకు తల్లిదండ్రులు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, కౌన్సిలర్ పన్నాల శ్రీవిద్యశ్రీనివాస్‌రెడ్డి, మండల వైద్యాధికారిని త్రివేణి, ఏఎన్ఎంలు నాగమణి, జహేద, సుజాత, వసుంధర, అనిత, మౌనిక పాల్గొన్నారు.

# వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలివ్వాలి




**ప్రజావారధి/శాలిగౌరారం**

వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లకపాక రాజు డిమాండ్ చేశారు. సోమవారం శాలిగౌరారం ఏపీఎం కార్యాలయం ఎదుట ఐకేపీ వీవోఏ ఉద్యోగ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. అనంతరం ఏపీఎం పోలేపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సెర్ప్ సంస్థలో గత 25 సంవత్సరాలుగా గ్రామస్థాయిలో వీవోఏలుగా సేవలు అందిస్తున్నారని, ప్రభుత్వం మహిళల కోసం చేపట్టిన అనేక కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గ్రామస్థాయిలో మహిళల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రూ.18 వేల వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గుండ్లపల్లి వెంకయ్య, ఆశావర్కర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు గుండ్ల సైదమ్మ, వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు కల్లూరి రేణుకాదేవి, వీవోఏలు ఎర్ర రాజా, ఇంద్రకంటి శ్రీకన్య, నాగలక్ష్మి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక






# సేవే పరమావధిగా లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలి

## లయన్స్ క్లబ్ జిల్లా పాస్ట్ గవర్నర్ లయన్ రేపాల మదన్ మోహన్

**ప్రజావారధి/కట్టంగూరు**

సమాజ సేవే లక్ష్యంగా ప్రతి లయన్ సభ్యుడు పనిచేస్తూ సేవా కార్యక్రమాలను గ్రామస్థాయిలో మరింత విస్తరించాలని లయన్స్ క్లబ్ జిల్లా పాస్ట్ గవర్నర్ లయన్ రేపాల మదన్ మోహన్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం కట్టంగూర్‌లోని ఎంఎస్ఆర్ సిటీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడిగా గుడిపాటి శివప్రసాద్, కార్యదర్శిగా మంగదుడ్ల శ్రీనివాస్, కోశాధికారిగా కల్లూరి వెంకటేశ్వర్లు, ఇతర కార్యవర్గ సభ్యులు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన పదాధికారులను క్లబ్ సభ్యులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. సభలో రేపాల మదన్ మోహన్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, రక్తదానం, సామాజిక సంక్షేమం వంటి రంగాల్లో మరింత విస్తరించాలని సూచించారు. నూతన కమిటీ సేవాభావంతో పనిచేసి క్లబ్‌కు మంచి గుర్తింపు తీసుక రావాలని ఆకాంక్షించారు. కట్టంగూర్ క్లబ్ అనతికాలంలోనే ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి జిల్లాలోనే ఎంతో గుర్తింపు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ మల్టిపుల్ చైర్‌పర్సన్ లయన్ తీగల మోహనరావు, జిల్లా మొదటి వైస్ గవర్నర్ కోడే సతీష్, ఫస్ట్ గవర్నర్ డాక్టర్ యానాల మోహన్ రెడ్డి,ెండవ గవర్నర్ గూడపూరి వెంకటేశ్వరావు, జోన్ చైర్మన్ డెంకల సత్యనారాయణ, డీసి మెంబర్ బుడిగె శ్రీనివాసులు, ఎర్ర శంభులింగారెడ్డి, క్లబ్ అడ్వైజర్ రెడ్డిపల్లి సాగర్, చార్టర్ ప్రెసిడెంట్ చిక్కు శేఖర్, పొగుల రాములు, ఉపాధ్యక్షుడు బసవోజు వినోద్ కుమార్, ప్రోగ్రాం చైర్మెన్ కక్కిరేణి నవీన్, శ్రీపాద నందగోపాల్, ఐతగోని లక్ష్మినారాయణ, కడవేరు మల్లికార్జున్, రాపోలు వెంకటేశ్వర్లు, గోశిక ఉమాపతి, శ్యామల హరీష్, పసునూరి సైదులు, ఆకుల సోమేశ్వర్, వెంకటేష్, లక్ష్మి, గుడిపాటి పద్మ, లత, స్వాతి, బండ మల్లారెడ్డి, చిత్రం నర్సింహ, ఐతగని సత్యనారాయణ, గుడిపాటి శ్రీనివాసులు, గుడిపాటి రామలింగయ్య, పున్న సుందర్, శ్యామల అశోక్, మన్నెం అంజయ్య, చిక్కు వాణి, రెడ్డిపల్లి వెంకటమ్మ, కల్లూరి సంధ్య, దండెపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

